


epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

సంపుటి : 19 సంచిక : 123 | 24-07-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | published from Nalgonda, circulated throughout Telanagana state | పేజీలు : 12 వెల: రూ. 1.00

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామి సంస్థ

●గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి

- ●పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- ●గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి
- ●ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ? ఎందుకు డిమాండ్ చేయదు
- ●బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే
- ●సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- ●అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ●ఓటు లేకపోతే పథకాలు పోతా యని హెచ్చరిక
- ●విడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినావి సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం విడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్

- మిగతా2లో...



## ఆందోళనకారులతో మాట్లాడతాం.... మీకు వీలైనప్పుడే చర్చిద్దాం: కేంద్రమంత్రి

- ●నీట్ ఆందోళనకారులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి పిలుపు
- -జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న రసనలు, ఆందోళనలు
- -కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్

నీట్ పేపర్ లీక్ వివాదంపై దేశ రాజధాని ఢిల్లీలో కొనసా గుతున్న ఆందోళనలను పరిష్కరించేందుకు చర్చలకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. నిరసనకారులకు అనువైన సమయంలో చర్చలు జరిపేందుకు తాము సిద్ధమని, శాంతియుత మార్గంలో సమస్యను పరిష్కరిం చుకుందామని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. గురువారంఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు, విద్యార్థులతో చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా

- మిగతా2లో...

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ

- ●విద్యార్థుల భవిష్యత్తే అత్యంత ముఖ్యమన్న మోదీ
- ●పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- ●వేగవంతమైన విచారణ, కఠిన శిక్షలకు ఆదేశాలు
- ●విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయమన్న ప్రధాని
- ●దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో స్పందించిన ప్రధాని




## మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

- ●పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?
- ●పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- ●కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- ●రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే బీఆరఎస్ కు కడుపుమంట
- ●డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆరఎస్
- ●ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- ●బీఆరఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆరఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను

- మిగతా2లో...

## తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య


- ●తెల్లవారుజామున తుపాకీతో కాల్చుకుని కానిస్టేబుల్ స్వామి ఆత్మహత్య
- ●తన భార్య, పిల్లలు చాలా మంచివాళ్లు అంటూ సూసైడ్ నోట్
- ●కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు

హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. డీజీపీ ఆఫీసులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే కానిస్టేబుల్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పూట విధుల్లో ఉన్న స్వామి, ఉదయం దాదాపు 5.30 గంటలసమయంలో వాష్‌రూమ్‌లోకి

- మిగతా2లో...

## విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి

### -ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
### -మోడీ ట్వీట్‌పై రాహుల్, అభిజిత్ దీప్కె



నీట్ పేపర్ లీకేజీపై దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఉద్యమాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పేపర్ లీకేజీ బాధ్యులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని

- మిగతా2లో...




## కాంగ్రెస్, జంతర్ మంతర్ రాజకీయాలు

- -గతంలో లీక్ అయితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా
- -టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు
- -కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ?యనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు

- మిగతా2లో...

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్

- ●ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- ●అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ●ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన




ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో

- మిగతా2లో...

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. విద్యార్థుల సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వారిపై వేగంగా, కఠినంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో.. పేపర్ లీక్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తై నిందితులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుందని, ఈ నిర్ణయం కూడా అందులో భాగమని మోదీ అన్నారు. యువత భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్‌మంతర్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

-మొదటిపేజీ తరువాయి

వెళ్లి తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. తీవ్ర గాయంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా భార్య, పిల్లలను ఎవరూ ఏమీ అనొద్దు.. వాళ్లు చాలా మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత దెయ్యంగా మారైనా సరే నా కుటుంబాన్ని, పిల్లలను జాగ్రత్తగా కాపాడుకుంటాను" అని ఆయన తన డైరీలో రాసుకున్న ఆఖరి మాటలు అందరినీ తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్

-మొదటిపేజీ తరువాయి

ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి

-మొదటిపేజీ తరువాయి

గురువారం ఉదయం ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. అయితే ప్రధాని మోదీ ట్వీట్‌పై లోకసభ విపక్ష నేత, సీజేపీ గట్టి కౌంటర్ ఇచ్చాయి. విద్యార్థుల జీవితాలను దెబ్బ తీసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించాయి. ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌పై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేరానికి పాల్పడిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మరోవైపు సీజేపీ కూడా మోదీ ప్రకటనపై దీటుగా స్పందించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతక బాధ్యత వహిస్తూ రాజీనామ చేయాలన్నారు. విద్యార్థులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్స్ నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

### ఆందోళనకారులతో మాట్లాడతాం.. మీకు వీలైనప్పుడే చర్చిద్దాం: కేంద్రమంత్రి

-మొదటిపేజీ తరువాయి

చేశామని, తాను, మరో కేంద్రమంత్రి జేపీ నడ్డా చర్చలకు అందుబాటులో ఉంటామని జితేంద్ర సింగ్ వెల్లడించారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి వర్గాలు, పలు సంఘాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వివాదం నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు.యితే, చర్చలు జరపాల్సిన వేదికపై ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు లేదా నేతల నివాసాల్లో సమావేశమవ్వడానికి నిరసనకారులు సమ్మతించడం లేదు. జంతర్ మంతర్‌ను "ప్రజా న్యాయస్థానం"గా అభివర్ణిస్తున్న విద్యార్థి సంఘాలు, చర్చలు అక్కడే లేదా ఏదైనా తటస్థ ప్రదేశంలో జరపాలని పట్టుబడుతున్నాయి.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామి సంస్థ

-మొదటిపేజీ తరువాయి

చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆరఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆరఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆరఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆరఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రావిణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేక పోతే సంక్షేమం రాదు' అని అన్నారు. బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆరఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎసఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆరఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆరఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

-మొదటిపేజీ తరువాయి

నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న వి సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా విసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సవిక్షించారు. సవిక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్దిపొందాలని బీఆరఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆరఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆరఎస్ విషప్రచారం చేస్తోంది. పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. బీఆరఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలి, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే లక్ష్యం. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్ గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. లబ్దిదారుల విద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్దిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఎ-లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బిసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం , ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం. ఈ 50 శాతం రిజర్వేషన్లలో కూడా 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నాం. మిగిలిన 50 శాతం వాటా జనరల్ కేటగిరీలో కేటాయిస్తాం. పేద మధ్యతరగతి ప్రజల విద బిఆరఎస్ కు... ఆ పార్టీ లోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉంటే విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నాను. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్ర వ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్, జంతర్ మంతర్ రాజకీయాలు

-మొదటిపేజీ తరువాయి

లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా వికు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

### కుక్కల దాడిలో మేకలు మృతి -- బాధిత కుటుంబానికి రూ.20000/- ఇరువై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

**-కుక్కల దాడిలో మేకలను కోల్పోయి తీవ్ర నష్టాన్ని చవిచూసిన కుటుంబానికి అండగా నిలిచి, ఆర్థిక భరోసా కల్పించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**

అక్షర కలం సిద్దిపేట జూలై 23:

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన గాంతి శ్రీను మేకలపై కుక్కలు దాడి చేయడంతో సుమారు 40కు పైగా మేకలు మృతి చెందిన విషాద ఘటనను తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే వారి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మేకల మృతితో తీవ్ర ఆర్థిక నష్టం ఎదుర్కొంటున్న కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సాయం అందజేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనతో కుటుంబం తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటోందని, ధైర్యం కోల్పోవద్దని, ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామని వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా కల్పిం చారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఎల్ నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు కలెక్టర్ సూచనలు




అక్షర కలం, నారాయణపేట జిల్లా, ప్రతినిధి:( జులై, 23)

ఎల్ నినో వాతావరణ పరిస్థితులలో రైతులు వ్యవసాయ ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా తయారు చేయబడ్డ ఎల్ నినో నేపథ్యంలో పంటల ప్రణాళికలు పుస్తకాన్నీ ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల పంపిణీలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందనీ. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టడం అవసరం అన్నారు.ౖతులకు సూచనలు: వాతావరణ శాఖ విడుదల చేసే అంచనాలను ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. ఆలస్యంగా వర్షాలు వచ్చినట్లయితే తక్కువ కాలవ్యవధి గల మరియు కరువు తట్టుకునే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ కి రైతులు తెలియచేయడం జరిగింది. వారి సమస్యలు విని, సమస్యలు పరిష్కరిస్తాం అని రైతులకు తెలియచేయడం జరిగింది. రైతు శాస్త్రవేత్త డాక్టర్ సత్య నారాయణ మాట్లాడుతూ వివిధ పంటలలో సస్య రక్షణ చర్యల గురించి, అలాగే ఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో రైతులు చెప్పల్సిన చర్యల గురించి, నానో యూరియా నానో డి ఏ పి వాడకం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, , జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, శాస్త్రవేత్తలు ,గ్రోమోర్ అధికారి ఇతర అధికారులు, రైతులు మరియు గ్రోమోర్ కంపెనీ వారు పాల్గొనడం జరిగింది.

# మరికల్ గ్రామపంచాయతీ దుకాణాలు ఖాళీ :



అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,( జులై,23)

మరికల్ : మరికల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఉన్న దుకాణాలను గురువారం ఖాళీ చేయించినట్లు గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి మల్లేష్ తెలిపారు. దుకాణాల కిరాయిలు దీర్ఘకాలంగా బకాయిలుగా ఉన్నప్పటికీ, పలుమార్లు గుర్తు చేసినప్పటికీ కిరాయిదారులు చెల్లించ కపోవడంతో, అతి దుకాణాలకు టెండర్ల ద్వారా వేసి దక్కించుకున్న వారికి అప్పగించే దిశగా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈ దుకాణాలను ఖాళీ చేయించామని కార్యదర్శి వివరించారు. గ్రామపంచాయతీకి చెందిన దుకాణాలు ప్రజా ఆదాయానికి మూలం కావడంతో, కిరాయిలు చెల్లించని వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. దుకాణాల ఖాళీకరణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మరికల్ లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం :



అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, (జులై, 23)

నారాయణ పేట నియోజక వర్గ ఎమ్మెల్యే, చిట్టెం పర్నిక రెడ్డి, మాజీ డి సి సి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకులి, గురువారం మరికల్ మండల కేంద్రంలోని స్థానిక 1వ వార్డులోని, శాంతి నగర్ కాలనీ లోని , పవన్ కుమార్ నూతన ఇందిరమ్మ ఇళ్లు లినారాయణ పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు ఎస్ .సూర్య మోహన్ రెడ్డి, సర్పంచ్ గూప చెన్నయ్య, 1 వ వార్డు సభ్యులు పెంట మిది రాజేశ్వరి రఘు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించడం జరిగినది. వీరితోపాటు ఈ కార్యక్రమములో వార్డు సభ్యులు వసంత, రాధ, లక్ష్మి రఘు, 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాలెమోని రామకృష్ణ, మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెలగొంది వీరన్న,ఆనంద్ కుమార్, గొల్ల రాజు, జంగిడి రవి, టైసన్ రఘు, మంగలి రఘు, కుమ్మరి చెన్నప్ప ,శాంతి నగర్ శివ,మడ్డి రాజు, మల్లారెడ్డి, సద్దాం, శ్రీనివాసులు, అంజప్ప, తరుణ్ కుమార్ రెడ్డి , గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ హైమావతి



అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 23 :

జిల్లాలోని హుస్నాబాద్ పట్టణం మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బంది సమయవేళలు పాటిసు ్న్నారా, విధులు టైం టేబుల్ వివరాలను ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓ పి రిజిస్టర్ వెరిఫై చేశారు. హుస్నాబాద్ నలుమూలల నుండి ఆసుపత్రికి రోగులు వస్తారని ప్రతి ఒక్కరికి మంచి మెరుగైన వైద్యం అందించాలని, భరోసా కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి వైద్య పరికరాలు, మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలో పలు విభాగాలకు సంబంధించి వైద్యులు సిబ్బంది కావాలని కోరగా సానుకూలంగా స్పందించి ప్రాధాన్యత మేరకు దగ్గర్లోని ఆసుపత్రి నుండి వైద్యులను సిబ్బందిని హుస్నాబాద్ ఆసుపత్రికి కేటాయించాలని డిఎంఅండ్ఎచ్ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.అనంతరం ఆసుపత్రి ముందు 82 కోట్లతో చేపట్టిన 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం పనులు వేగంగా జరుగుతు న్నాయని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్మాణంలో జాప్యం చేయకుండా నిర్ణిత కాల వ్యవధిలో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చెయ్యాలని ఇంజనీరింగ్ మరియు కాంటాక్టర్ ను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణం పనులు చేసే కార్మికుల పిల్లలను దగ్గరలోని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట హుస్నాబాద్ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస్, కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా జీఎంను కలిసిన ఎస్‌బీఐ నూతన మేనేజర్



మందమర్రి, జూలై 23 అక్షర కలం:

పట్టణంలోని యాపల్ బ్రాంచ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) నూతన బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి కళారామన్ గురువారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళారామన్ జిఎం రాధాకృష్ణ కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మాని ంచారు. అనంతరం జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు, ఏరియాలోని యాపల్ ఎస్‌బీఐ శాఖకు ఎన్నో సంవత్సరాలుగా విడదీయరాని అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. కార్పొరేట్ స్థాయి నుంచి బ్యాంకు యాజమాన్యంతో ఉన్న మంచి అనుబంధం వల్ల సింగరేణి కార్మికులకు మెరుగైన సేవలందు తున్నాయన్నారు. ఇదే స్నేహపూర్వక వాతావరణం, సుహృద్భావ సంబంధాలు ముమ్ముందు సైతం ఇలాగే కొనసాగాలని, సంస్థకు, సింగరేణి కార్మికులకు బ్యాంకు సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# గోగుల వెంకులు కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నేత “చల్లా కృష్ణ “



అక్షర కలం/ దానవాయిగూడెం:

పాలేరు నియోజకవర్గ పరిధిలో దాన్వాయిగూడెం 59 వ, డివిజన్ కు చెందిన “గోగుల వెంకులు” కుటుంబానికి కాంగ్రెస్ నేత “చల్లా కృష్ణ” ఆర్థిక సాయం అందించి భరోసా గా నిలిచారు.నిరుపేద కుటుంబమైన గోగుల వెంకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో దశదిన కర్మలు కోసమై మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్చార్జి తుంబురు దయాకర్ రెడ్డి సలహాల మేరకు కాంగ్రెస్ పార్టీ తరపున 5వేలు, ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఈ మేరకు ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ నాయకుడు “చల్లా కృష్ణకు” మృతుని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన వారి చల్లా కృష్ణ టీం కు 59వ డివిజన్ ప్రజలు నిరుపేదలకు అండగా నిలుస్తూ ఇలాంటి రెక్కాడితే డొక్కాడని నిరుపేద ప్రజలకు అండగా నిలవడం గొప్ప విషయం అని ఖమ్మం టౌన్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ “చల్లా కృష్ణకు” కృతజ్ఞతలు చెబుతూ ప్రశంశించారు.

## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలు

-అర్హత లేని వారికి ఉద్యోగలిచ్చారు
-విచారణ జరిపి న్యాయం చేయాలి
-దగ్గుబాటి సామ్రాజ్యం




అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో:

ఖమ్మం: చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ గ్రామానికి చెందినాఫ్ దగ్గుబాటి సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి, అర్హత లేని, తక్కువ అర్హతలు కలిగిన ఇతర వ్యక్తులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆమె ఆరోపించారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సామ్రాజ్యం మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపిక విషయంలో గ్రామ అధికార పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వ్యవహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి కాలయాపన చేయించి, చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం ఒక నిమిషం పాటు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, విద్యార్హతలు, అనుభవాన్ని సరిగా పరిశీలించకుండా ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేశారని ఆమె ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా ఉన్నప్పటికీ, దానికంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, స్థానిక నాయకులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ నియామకాల విషయంలో డబ్బులు చేతులు మారినట్లు తమకు అనుమానంగా ఉందన్నారు. ఉద్యోగాల నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ ప్రక్రియ, ఎంపిక జాబితా, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన విచారణ జరపాలి. నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలి. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా మళ్లీ పరిశీలించాలి” అంటూ డిమాండ్ చేశారు....

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు:

-ధన్వాడ ఇన్చార్జ్ ఎస్సై మహేశ్వరి.



అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి,( జులై 23)

ధన్వాడ: మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ రోజు ధన్వాడ మండల కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ధన్వాడ ఇన్చార్జ్ ఎస్ఐ మహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా బస్ స్టాండ్ పాన్ షాపులు, కిరణం, నిర్మానుష్య తదితర ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ , ధన్వాడ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన

**-ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి**

**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల/ ధర్మపురి, జూలై 23 (అక్షర కలం)

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ధర్మపురి మున్సిపల్ పరిధిలో 5 వార్డులోని 33 పి. ఎస్ పరిధిలో ఇంటింట నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, ఫారాలను కూడా ఈ ఆగస్టు 3వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ప్రజలను కోరారు.ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 3వ తేదీలోపు



ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ శ్రీనివాస్ , బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 23

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత




సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి మండలంలోని గ్రామపంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండల



కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అత్యవసర విభాగం, సామాజిక వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఓపి రిజిస్టర్ అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, ధాన్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలి






**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**


అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 23:

జిల్లాలో సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు, మర్రిగూడ గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులను, దండేపల్లి మండలం లింగాపూర్‌లోని శ్రీ కృష్ణ అగ్రో ఇండస్ట్రీస్, పెద్దపేటలోని భవాని ఇండస్ట్రీస్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పీబీఆర్ఎం, రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయా మండలాల తహశీల్దార్‌లతో కలిసి పరిశీలించి అధికారులతో వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పెండింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, 2025--26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెండింగ్ సిఎంఆర్ బియ్యం సంబంధిత పురోగతిని సమీక్షించారు. రైస్ మిల్లులలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, నిర్దేశిత గడువులోగా సిఎంఆర్‌ను పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లుల యాజమాన్యాలకు సూచించారు. అనంతరం జన్నారం, దండేపల్లి తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని, రికార్డులను అనుసరించి 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి మండలాల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర కలం తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

### కాంగ్రెస్‌కు పేరొస్తుందనే మెట్రోపై వివక్ష!



హైదరాబాద్ మెట్రో రైలుపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తొలి నుంచీ వివక్ష చూపుతూనే ఉన్నది. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 2007లో హైదరాబాద్ మెట్రోకు పునాది పడింది. నాటి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి జైపాల్‌రెడ్డి చొరవతో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైంది. ఒకప్పుడు దేశంలో ఢిల్లీ మెట్రో తర్వాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో.. బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం ఫలితంగా నేడు తొమ్మిదో స్థానానికి పడిపోయే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోపై వివక్ష చూపుతోందనేది రాజకీయ విమర్శ ఎంతమాత్రం కాదు. దేశంలోని ఆరు ముఖ్య నగరాలైన ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో మెట్రో రైళ్ల ట్రాక్ పొడవు.. విస్తరణ పనులు పరిశీలిస్తే అర్థమవుతుంది. ఢిల్లీ మెట్రో ఇప్పటికే 395.81 కి.మీ దూరం ఉండగా, మరో 157.75కి.మీ మేర విస్తరణ పనులు సాగుతున్నాయి. ముంబయిలో ఇప్పటికే 110కి.మీ మేర మెట్రో ఉండగా (141.4 కి.మీ విస్తరణ పనులు), కోల్‌కతాలో 72.98 కి.మీ మేర ఇప్పటికే మెట్రో (60.26 కి.మీ మేర విస్తరణ పనులు) ఉంది. చెన్నైలో 54.24కి.మీ మేర మెట్రో (118.9 కి.మీ మేర విస్తరణ పనులు) ఉంది. బెంగళూరులో 96.1 కి.మీ మేర మెట్రో ఉండగా, 121.13 కి.మీ మేర విస్తరణ పనులు సాగుతున్నాయి. హైదరాబాద్‌లో మాత్రం కేవలం 69 కి.మీ మేర మాత్రమే మెట్రో రైలు ఉంది. ఫేజ్--2 విస్తరణలో హైదరాబాద్‌కు చోటు దక్కలేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచే హైదరాబాద్ మెట్రో ఫేజ్--2పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రధాన మంత్రి, కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ మంత్రులను పలుమార్లు కలిసి హైదరాబాద్ మెట్రో ఫేజ్--2కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విస్తరణ పనులకు సంబంధించి నియమించిన కార్యదర్శుల కమిటీలో ఉత్తరప్రదేశ్ మెట్రో ఎండీ సుశీల్ కుమార్‌ను కేంద్రం నియమించినా, తర్వాత రకరకాల కొర్రీలు వేయడం ప్రారంభించింది. మొదట మెట్రో ఫేజ్--1 నిర్వహణ చూస్తున్న ఎల్‌డటీని సంప్రదించాలని సూచించింది. కేసీఆర్ ప్రభుత్వంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలతో ఫేజ్--2 విస్తరణ అటుంచి ఫేజ్--1 నుంచే తప్పుకుంటామని ఎల్‌డటీ సంస్థ స్పష్టం చేసింది. దాంతో ఫేజ్--2 విస్తరణకు అనుగుణంగా ఫేజ్--1ను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌డటీకి చేయాల్సిన చెల్లింపులకు సంబంధించిన మొత్తానికి అవసరమైన వనరుల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవతో హైదరాబాద్ మెట్రో రైలుకు తక్కువ వడ్డీతో రుణం ఇచ్చేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ సిద్ధమైంది. కానీ అక్కడి నుంచి సకాలంలో నిధులు విడుదల కాలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెట్రో విస్తరణ చేపట్టాలని భావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టువీడకుండా గత జూన్ 22, 23 తేదీల్లో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో రెండు రోజుల పాటు ఢిల్లీలో వరుసగా భేటీ అయ్యారు. నాటి చర్చలు పూర్తి సానుకూలంగా సాగాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్--1 వాల్యూయేషన్, ఫేజ్--1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్--2 విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాల అధ్యయనానికి కన్సల్టెంట్‌ను నియమించాలన్న అంశంపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ూదీ×జూూూను ఎంపిక చేశారు. కన్సల్టెంట్ అధ్యయన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయానికి కేంద్రం, రాష్ట్రం నుంచి చెరో అధికారిని నియమించాలని నాడు నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీనియర్ అధికారి జయేశ్ రంజన్‌ను నియమించింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తమ తరఫు అధికారిని నియమించలేదు. కన్సల్టెంట్‌గా ూదీ×జూూూను నియమిస్తూ ఎటువంటి ఆదేశాలూ జారీ చేయలేదు. ఏ రాష్ట్రం నుంచైనా ప్రాతినిధ్యం వహించే కేంద్ర మంత్రులు ఆయా రాష్ట్రాల ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తారు. కానీ తెలంగాణలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి మోదీ రాష్ట్రానికి వస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం స్వాగతం పలికేవారు కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటాను విడుదల చేసేవారు కాదు. ఫలితంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు దక్కేవి కావు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు భిన్నంగా, సైద్ధాంతికంగా పొసగకపోయినప్పటికీ, ప్రొటోకాల్ ప్రకారం ప్రధానమంత్రికి స్వాగతం పలుకుతున్నారు. రాష్ట్ర వాటాలు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ కేంద్రం నుంచి నిధులు రాబడు తున్నారు. సమాఖ్య స్ఫూర్తిని పాటిస్తున్నారు. అయినప్పటికీ చట్టబద్ధంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతూనే ఉన్నది. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉండడమే కాకుండా సికింద్రాబాద్ ఎంపీగానూ కిషన్‌రెడ్డి ఉన్నారు. మెట్రో సేవలు అందే, మెట్రో విస్తరణతో లాభం పొందే హైదరాబాద్ మహానగరం పరిధిలోనే సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గాల నుంచి కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు ఎంపీలుగా ఉన్నారు. వీరంతా బీజేపీ ఎంపీలే.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

ఆట

## జింబాబ్వేతో తొలి టీ20: టాస్ గెలిచిన భారత్.. జట్టులోకి కొత్త ఫాస్ట్ బౌలర్

- టీ20 అరంగేట్రం చేసిన అశోక్ శర్మ
- జింబాబ్వేలో బెన్ కరన్, న్యామ్‌హురి టీ20 డెబ్యూ
- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్
- పిచ్‌పై బౌన్స్ ఉంటుందని శ్రేయస్ అంచనా



తర్వాత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందన్న జింబాబ్వే కెప్టెన్ హరారేలో జరుగుతున్న తొలి టీ20 హరారే వేదికగా జింబాబ్వేతో గురువారం ప్రారంభమైన తొలి టీ20లో భారత జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌తో యువ ఫాస్ట్ బౌలర్ అశోక్ శర్మ భారత జట్టు తరపున అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేశాడు. పిచ్‌పై బౌన్స్ ఉండే అవకాశం కనిపిస్తోందని, అందుకే ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించామని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. జింబాబ్వే గత కొన్నేళ్లుగా మంచి క్రికెట్ ఆడుతోందని, తమ బలాలను సమర్థంగా ప్రదర్శిస్తోందని ప్రశంసించాడు. మరోవైపు జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా మాట్లాడుతూ ఈ పిచ్ సాధారణ హరారే వికెట్‌లా లేదని, ఆరంభంలో బౌలర్లకు కొంత సహకరించినా తర్వాత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో ఓడినా తమ జట్టులో ఎన్నో సానుకూల అంశాలు కనిపించాయని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే తరపున బెన్ కరన్, న్యూమన్ న్యామ్‌హురి కూడా టీ20 అరంగేట్రం చేశారు. బెన్ కరన్ ఎవరో కాదు... ఇంగ్లండ్ క్రికెటర్లు శామ్ కరన్, టామ్ కరన్ ల సోదరుడే. వీరి తండ్రి కెవిన్ కరన్ జింబాబ్వే మాజీ క్రికెటర్. భారత్ జట్టు: వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకూ సింగ్,

# డబ్ల్యూటీసీ 2027 ఫైనల్‌కు వేదిక ఖరారు.. 150 ఏళ్ల టెస్ట్ క్రికెట్ వేడుకల మధ్య

- 2027 డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఓవల్ మైదానం వేదిక
- 2027 జూన్ 9 నుంచి 13 వరకు ఫైనల్ మ్యాచ్
- టెస్ట్ క్రికెట్ 150 ఏళ్ల వేడుకల నడుమ ఈ ఫైనల్
- 2023 తర్వాత మరోసారి ఓవల్‌లోనే ఫైనల్ పోరు



ప్రస్తుత పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2027 ఫైనల్‌కు వేదిక ఖరారైంది. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు లండన్‌లోని చారిత్రక ఓవల్ మైదానం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2027 జూన్ 9 నుంచి 13 వరకు ఈ ఫైనల్ మ్యాచ్ జరగనుందని ఐసీసీ నేడు అధికారికంగా ప్రకటించింది. వల్ మైదానం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇది రెండోసారి. 2023లో జరిగిన ఫైనల్ కూడా ఇక్కడే జరిగింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. 2025లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో రాబోయే మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ (2027, 2029, 2031) నిర్వహించే హక్కులను ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) దక్కించుకుంది. ఇందులో భాగంగానే 2027 ఫైనల్‌కు ఓవల్‌ను ఎంపిక చేశారు. 2025 ఫైనల్ లార్డ్స్‌లో జరగ్గా, ఆస్ట్రేలియాను ఓడించి దక్షిణాఫ్రికా టైటిల్ గెలుచుకుంది. 2027లో జరిగే ఫైనల్‌కు మరో చారిత్రక ప్రాధాన్యం కూడా ఉంది. టెస్ట్ క్రికెట్ ప్రారంభమై 150 ఏళ్లు పూర్తవుతున్న చారిత్రక సందర్భంలో ఈ ఫైనల్ జరగనుంది. దీంతో ఈ తుది పోరుకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. గత రెండేళ్లలో నిలకడగా రాణించిన టాప్-2 జట్ల మధ్య ఈ టైటిల్ పోరు అభిమానులకు అసలైన టెస్ట్ మజాను అందించనుంది. ఈ సందర్భంగా ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ నీల్ స్నోబాల్ మాట్లాడుతూ.. "వరుసగా మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం మాకు గర్వకారణం. 2023లో ఓవల్‌లో జరిగిన ఫైనల్ అభిమానులను, బ్రాడ్‌కాస్టర్లను ఎంతగానో ఆకట్టుకుంది. వచ్చే ఏడాది జరిగే ఫైనల్ కూడా మరింత ప్రత్యేకంగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది. ప్రపంచంలోని అత్యుత్తమ రెండు జట్ల మధ్య పోరును చూసేందుకు ఇది గొప్ప అవకాశం" అని అన్నాడు. ఐసీసీ జనరల్ మేనేజర్ గౌరవ్ సక్సేనా మాట్లాడుతూ.. "ఐసీసీ, ఈసీబీ మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యానికి ఈ వేదిక ఎంపిక నిదర్శనం. టెస్ట్ క్రికెట్ 150 ఏళ్ల చరిత్రను జరుపుకుంటున్న వేళ, ఓవల్ లాంటి చారిత్రక మైదానంలో ఫైనల్ నిర్వహించడం అభిమానులకు మధురమైన జ్ఞాపకాలను అందిస్తుంది" అని పేర్కొన్నాడు. ఇప్పటివరకు మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ జరిగాయి. 2021లో సౌతాంప్టన్‌లో జరిగిన తొలి ఫైనల్‌లో న్యూజిలాండ్, 2023లో ఆస్ట్రేలియా, 2025లో దక్షిణాఫ్రికా విజేతలుగా నిలిచాయి. ఇక, ప్రస్తుత డబ్ల్యూటీసీ (2025-27) సైకిల్‌లో ఆస్ట్రేలియా 87.50 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా (75%) రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్, బంగ్లాదేశ్, భారత్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సినిమా
CINEMA

## చిన్న సినిమాల్లోనే దమ్ముంటుంది: 'కర్మాఖ్య' ఈవెంట్‌లో విజయశాంతి

వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రోత్సాహం కావాలన్న విజయశాంతి చిన్న సినిమాలకు మీడియా సహకారం అవసరమని వ్యాఖ్య రాజకీయాల్లో బిజీ వల్ల తనకు నటించే ఆలోచన లేదని వెల్లడి కొత్త ఆలోచనలు, వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రేక్షకులు, మీడియా నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి అభిప్రాయపడ్డారు. అలాంటి చిత్రాలకు సరైన గుర్తింపు దక్కితే తెలుగు సినీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. 'అదిరే అభి' (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన 'కర్మాఖ్య' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశాంతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వేడుకలో విజయశాంతి మాట్లాడుతూ... "పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. 'కర్మాఖ్య' సినిమాలో నటించిన అభినయ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... ఈ పాత్ర కోసం ఆమె గుండు చేయించుకోవాల్సిన అవసరం లేదని, కానీ కథపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని విజయశాంతి అభినందించారు. ఆమె పడిన కష్టానికి ప్రేక్షకులు కచ్చితంగా పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇక తన నటన కెరీర్ పై స్పందిస్తూ... ప్రస్తుతం తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదని... అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తానని వెల్లడించారు. కాగా, ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ 'కర్మాఖ్య' చిత్రం జూలై 31న థియేటర్లలోకి రానుంది.



## బిగ్ బాస్ అవకాశాన్ని వదులుకున్నా.. కారణం ఇదే: సత్యశ్రీ

జబర్దస్త్ షో ద్వారా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న సత్యశ్రీ బిగ్‌బాస్ నిర్వాహకుల నుంచి ఫోన్ వచ్చిందనేది నిజమేనని వెల్లడి కుటుంబం కోసం అవకాశాన్ని వదులుకున్నానన్న సత్యశ్రీ బుల్లితెరపై పాపులర్ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపును సంపాదించుకున్న నటి సత్యశ్రీ. ముఖ్యంగా చమ్మక్ చంద్ర టీమ్‌లో సుదీర్ఘకాలం అలరించిన ఆమె, తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే వెండితెరపైనా వరుస అవకాశాలు దక్కించుకుంటూ నటిగా ముందుకు సాగుతోంది. అయితే గత కొంతకాలంగా ఆమె బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షో 'బిగ్‌బాస్'లోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సత్యశ్రీ ఈ ప్రచారంపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించింది. తనకు బిగ్‌బాస్ నిర్వాహకుల నుంచి పిలుపు వచ్చిందనేది వాస్తవమేనని, ఆఫర్ వచ్చిందని స్పష్టం చేసింది. అయితే ఆ క్రేజీ అవకాశాన్ని తాను ఒప్పుకోలేకపోయానని తెలిపింది. తనపై కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని, ఇంటి బయట తాను చూసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను వదిలి సుదీర్ఘకాలం దూరంగా ఉండటం తన వల్ల కాదని, అందుకే బిగ్‌బాస్ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను బిజీగా గడిపేస్తోంది.



## మౌనం ప్రమాదకరం.. నోరు విప్పండి: మంచు లక్ష్మి

సమాజంలో జరుగుతున్న పరిణామాలపై నోరు విప్పాలన్న మంచు లక్ష్మి దేశ సమస్యలపై పట్టనట్టు ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని వ్యాఖ్య వాంగ్‌చుక్ వంటి యోధులకు సమాజం అండగా నిలవాలని పిలుపు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పౌరుల మౌనం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నోరు విప్పాలని సినీ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. 'మనకెందుకులే' అని దాటుకెళ్లే మనస్తత్వాన్ని వీడి, ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లడఖ్ రాజ్యాంగ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతు ప్రకటిస్తూ ఆమె ఇన్స్టాగ్రామ్‌లో ఒక సందేశాన్ని పంచుకున్నారు. దేశంలో ఏ విపత్తు లేదా సమస్య వచ్చినా తమకేమీ పట్టనట్లు ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతమని మంచు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన పనిలేదని.. కనీసం సామాజిక మాధ్యమాల ద్వారానైనా గొంతు కలపడం, విషయాలపై అవగాహన పెంచుకోవడం పౌరులుగా మన బాధ్యత అని గుర్తుచేశారు. నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడే వాంగ్‌చుక్ వంటి యోధులకు సమాజం అండగా నిలవాలని కోరారు. కేవలం రాజకీయ నాయకులను వేలెత్తి చూపడంతో బాధ్యత తీరిపోదని, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పౌరులు కార్యోన్ముఖులు కావాలని కోరారు. చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూస్తూ ఊరుకోవడం తనను తీవ్రంగా కలచివేస్తోందని ఆమె భావోద్వేగానికి గురయ్యారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# బొర్ర వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు... అన్నదానం, విద్యార్థులకు కిట్ల పంపిణీ





అక్షరకలం బిబినగర్

బీబీనగర్ మండల యువనాయకుడు బొర్ర వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలను కొండమడుగు వద్ద ఘనంగా నిర్వహించారు. కొండమడుగు మెట్టు శ్రీ శ్రీ శ్రీ మంగళ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం కాడిగాళ్ళ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండమడుగు గ్రామ జెడ్ పి హెచ్ ఎస్, ఎంపీపీ ఎస్ పాఠశాలల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, స్టేషనరీ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

# విద్యుత్ షాక్‌తో మెకానిక్ దుర్మరణం



అక్షరకలం,చండూరు

చండూరు మున్సిపాలిటీ పరిధిలోని లక్కినేనిగూడెం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ (38) అనే మోటార్ మెకానిక్ పుల్లెంల గ్రామంలో ఓ బోరుబావి వద్ద మోటార్ మరమ్మతులు చేస్తుండగా ఊహించని విధంగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతుండగా, కుటుంబ పోషణకు ఆధారమైన సయ్యద్ హఠాన్మరణంతో లక్కినేనిగూడెంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

# పేదరికాన్ని గెలిచిన ప్రతిభ

-కూలీ కూతురికి కోమటిరెడ్డి 10 లక్షల భరోసా

-మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని, కుటుంబ సభ్యులు

అక్షరకలం నల్గొండ

కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే పేదరికం ఏమాత్రం అడ్డంకి కాదని మరోసారి రుజువైంది. దేవరకొండ ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీల కుమార్తె, ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థిని విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనే కల నెరవేరబోతోంది. జర్మనీలోని ప్రముఖ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చదివేందుకు సీటు సాధించినప్పటికీ, ఆర్థిక పరిస్థితులు ఆమె ఆశయానికి అడ్డంకిగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆపద్బాంధవుడిలా స్పందించారు. విద్యార్థిని పడుతున్న కష్టాన్ని, చదువుపై ఆమెకున్న అంకితభావాన్ని గుర్తించిన మంత్రి 'కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా వెంటనే రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. "ప్రతిభ ఉన్న ఏ ఒక్క పేద విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదు. పేద విద్యార్థుల కలలను సాకారం చేయడంలో ప్రతీక్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని పునరుద్ఘాటించారు. జర్మనీలో ఉన్నత విద్యను పూర్తి చేసుకుని ఆ విద్యార్థిని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్థిక సాయం పొందిన విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి, ప్రతీక్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



అక్షరకలం వలిగొండ

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ఎం మండలం లో గురువారం ఏఐసిసి, పిసిసి పిలుపుమేరకు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందడి అనంత రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల నీట్ పరీక్ష పత్రం లీక్ జరిగిందని సుమారు 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చాలామంది విద్యార్థులు భవిష్యత్తు నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ నిరసన తెలియజేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని తెలిపారు. దేశ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ లను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యం స్ఫూర్తిని దెబ్బతీయడం లాంటిదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాపతినిధులు సర్పంచులు అనుబంధ సంఘాల నాయకులు యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు.

# గడువు దాటితే కోతపడే అవకాశం.!

-ఈనెల 31 నాటికి రేషన్ 'ఈ-కేవైసీ' 100% పూర్తి కావాలి

-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

-కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ వేయాల్సిందే

-వృద్ధులు, దివ్యాంగులకు సహాయం అందించాలని డీలర్లకు, తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

సివిల్ సప్లైస్ (పౌర సరఫరాల శాఖ) కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈ కేవైసీ పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ పూర్తయినందున, తదుపరి బియ్యం పంపిణీ ప్రారంభమయ్యేలోపు ఉన్న సమయాన్ని లబ్ధిదారులు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కేవైసీ పూర్తి చేయని వారందరూ వెంటనే తమ సమీపంలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణానికి (రేషన్ షాప్) వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేసుకోవాలని సూచించారు.

-ప్రతి సభ్యుడూ వెళ్లాల్సిందే..

రేషన్ కార్డులో పేరు నమోదైన ప్రతి లబ్ధిదారుడు వ్యక్తిగతంగా హాజరై ఈ కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే వృద్ధులు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు ఈ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను, రేషన్ డీలర్లను ఆదేశించారు.

-జూలై 31 ఆఖరి తేదీ...

ఈనెల 31 నాటికి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైతే, జిల్లాకు వచ్చే ఆహార ధాన్యాల కేటాయింపులపై సబ్సిడీ నిలిపివేత లేదా



కోటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి లబ్ధిదారుడు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని గడువు లోగానే ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లాలోని అందరూ తహసీల్దార్లు, చౌక ధరల దుకాణ డీలర్లు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని, మిగిలి ఉన్న ఈకేవైసీ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# నీట్ కుంభకోణంపై కదిలిన 'నల్గొండ'

-నేడు విద్యాసంస్థల బంద్

-ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలి

-కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విద్యార్థి సంఘాల డిమాండ్

-బంద్‌కు సహకరించాలని పిలుపు

అక్షరకలం నల్గొండ





దేశంలో నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడడమే కాకుండా, మనస్తాపంతో 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో డిమాండ్ చేశాయి.

-నల్గొండ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో

ఎస్ఎఫ్ఐ పిడిఎస్ యూ, ఎన్ ఎస్ యూ ఐ, ఎఐఎస్ఎఫ్ తదితర వామపక్ష, ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ యు, ఎన్ ఎస్ యుఐ జిల్లాల నాయకులు ఖమ్మంపాటి శంకర్, ఇందూరి సాగర్, అంజన్ కుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ తీవ్ర విమర్శలు చేశారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న నీట్ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులు, మేధావులు, సామాజికవేత్తలపై కేంద్ర ప్రభుత్వ సమక్షంలో పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి పైశాచిక ఆనందం పొందడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలి. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 1 కోటి చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలి. నీట్ పేపర్ లీకేజీపై పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేస్తే దేశ ప్రధాని ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. విద్యార్థులతో పెట్టుకుంటే కేంద్ర ప్రభుత్వ పునాదులు కదులుతాయని హెచ్చరించారు.

-విద్యాసంస్థల బంద్' జయప్రదం చేయండి..

విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా నేడు నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ బంద్ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి పవన్, ఎస్ఎఫ్ఐ నాయకులు మరుపాక కిరణ్, నవదీప్, అడిల్, యశ్వంత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు హర్షవర్ధన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం









అక్షరకలం, చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో దివిస్,యాజమన్యం సహకారం 25 లక్షల నిధులతో నిర్మించిన గ్రంధాలయ భవనం ప్రహరి గోడను, ఫర్నిచర్ తో కూడిన పుస్తకాలను గురువారం గ్రామ సర్పంచ్ శ్రీలత ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం దివస్, యాజమాన్యం అందిస్తున్న సహయ సహకారాలు అభినందనీయమని దివీస్ పరిశ్రమ కల్పించిన ఈ గ్రంథాలయ సౌకర్యాన్ని గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో దివిస్ విభాగం సి.ఎస్.ఆర్ మేనేజర్, బి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి,విద్యాభివృద్ధికి దివీస్ యాజమాన్యం తోడ్పాటు అందించడంలో ముందు ఉంటుంది అని,గ్రామంలో నిరుద్యోగులు,విద్యార్థులు,పెద్దలు గ్రామంలో ప్రతి ఒక్కరు ఈ గ్రంధాలయాన్ని వినియోగించు కోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయ సదానందం,వార్డు సభ్యులు సప్పిడి లింగారెడ్డి,సప్పిడి ప్రభాకర్ రెడ్డి,గోని పరమేశ్వరి,బోయ హరిత,గుండెపురం ప్రతిభా,బండ శేఖరు, అంతటి సౌజన్య,శ్వేత,రత్నం శ్రీకాంత్,బొమ్మల రాజు బాతరాజు వెంకటేష్,మాజీ సర్పంచ్ లు,మాజీ యంపిటిసి లు, మాజి ఉప సర్పంచ్ లు, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.బాలరాజు,పాఠశాల విద్యార్థులు,మహిళ సంఘాల సభ్యులు, దివీస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు, తదితరులు, పాల్గొన్నారు.

# యాదాద్రీశుడి సన్నిధిలో మంత్రి కొండా సురేఖ

-శివాలయంలో 'వరుణ యాగం'లో భక్తిశ్రద్ధలతో భాగస్వామ్యం

-ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి స్వామివారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ మంత్రి

-రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు





ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం దర్శించుకున్నారు. కొండపైకి చేరుకున్న మంత్రికి పోలీస్ యంత్రాంగం గౌరవ వందనంతో ఆత్మీయ స్వాగతం పలికింది. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ కొండా సురేఖకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి కొండా సురేఖ స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు అర్చకులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఈవో భవానీ శంకర్ మంత్రికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

-వరుణ యాగంలో పాల్గొన్న మంత్రి...

యాదగిరి కొండపై ఉన్న అనుబంధ ఆలయమైన శివాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వరుణ యాగ పూజల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ యాగాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బ్రాహ్మణులను, అర్చక సమూహాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. "రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి ప్రజలందరూ సిరిసంపదలతో తులతూగాలని స్వామివారిని ప్రార్థించాను. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ లక్ష్మీనారాయణ నాయక్ దంపతులు, స్థానిక నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అక్షరకలం తెలుగు దినపత్రిక నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు






-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
-కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ దేవరకొండలో కాంగ్రెస్ భారీ ఆందోళన
-ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్న బీజేపీ
-డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత
-ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం

అక్షరకలం దేవరకొండ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఢిల్లీలో జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే దురదృష్టకరమని, ఇది కేవలం ఒక్క వ్యక్తిపై జరిగిన దాడి కాదని, రాజ్యాంగం,ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తీవ్రంగా ఖండించారు. టీపీసీసీ పిలుపు మేరకు గురువారం దేవరకొండ బస్టాండ్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో కలిసి ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలపై ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీకి ఉందని, ఆయన గొంతును అణచివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భౌతిక దాడులు, కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దేశ స్వాతంత్ర్యం మరియు అభివృద్ధి కోసం నెహ్రూ-గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని కొనియాడారు. "దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రజాదరణ, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న అపారమైన ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ ప్రభుత్వం ఈ తరహా కుట్రలకు పాల్పడుతోంది. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

-నేనావత్ బాలు నాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, రాహుల్ గాంధీకి దేవరకొండ నియోజకవర్గ ప్రజల తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల/పట్టణ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ , వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కులవృత్తులే మన సంస్కృతికి ప్రతీకలు

-యాదగిరిగుట్టలో బుట్టలు అల్లిన మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

అక్షరకలం యాదాద్రిభువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కలిసి పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా స్థానిక కాలనీలో సంప్రదాయ పద్ధతిలో వెదురు తట్టలు, బుట్టలు అల్లుతూ జీవనం సాగిస్తున్న ఒక కుటుంబాన్ని వారు ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న అనంతరం, వారి వృత్తి విధానం గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా, మంత్రి కొండా సురేఖ, విప్ బీర్ల అయిలయ్యలు స్వయంగా కొంతసేపు తట్టలు, బుట్టలు అల్లేందుకు ప్రయత్నించి చేతివృత్తిదారులతో ముచ్చటించారు. వారి శ్రమను ప్రోత్సహించేందుకుగాను, వారు తయారు చేసిన రెండు వెదురు తట్టలను స్వయంగా కొనుగోలు చేశారు.

-ప్లాస్టిక్‌కు బదులుగా వెదురు ఉత్పత్తులను వాడాలి...





ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, "కులవృత్తులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని ఉద్ఘాటించారు. మారుతున్న కాలంతో పాటు ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరగడం వల్ల ఇలాంటి సంప్రదాయ చేతివృత్తులు కనుమరుగయ్యే పరిస్థితి రావడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెదురు ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, సంప్రదాయ కులవృత్తులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని పేర్కొన్నారు. వీటిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవడం ద్వారా వారి జీవనోపాధికి కొండంత భరోసా కల్పించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి సహజసిద్ధమైన, వెదురు ఉత్పత్తులను వాడితే పర్యావరణంతో పాటు కులవృత్తులను కూడా కాపాడుకున్నవారమవుతామని అన్నారు. చివరగా, ప్రజలందరూ స్వదేశీ, సంప్రదాయ ఉత్పత్తులను ఆదరించి కులవృత్తులను గౌరవించాలని, వాటి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.

# భూముల రీ సర్వేతో భూ సమస్యలకు చెక్......

- కలెక్టర్ ప్రతిమాసింగ్......

మెదక్/ కొల్చారం జూలై 23(అక్షర కలం):-

గురువారం మెదక్ మండలం కొమటూర్ గ్రామంలో భూభారతి భూముల రీ సర్వేలో గ్రామసభలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మోకాపై సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుందని, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చే పడతామని, నిజమైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. భూ భారతి రెవె న్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీ లించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగనలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారిస్తామని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమిస్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూముల సైతం నిర్ధారణ అవుతాయన్నారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక



కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్ర మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందన్నారు.

# అంగన్వాడీ టీచర్ల సర్టిఫికెట్లు పరిశీ స్తున్న సిడిపిఓ జయలక్ష్మి...

అక్షర కలం/పినపాక.

మణుగూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్ల పోస్టులు 24 ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని సిడిపిఓ జయలక్ష్మి తెలిపారు. ఈ పోస్టులకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోపు సర్టిఫికెట్లు వేరిఫికేషన్ చేయించుకోని రెండు సెట్లు జిరాక్స్ కాపీలు కార్యాలయంలో సమ ర్పించాలని ఆమె తెలియజేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీశ్రీ నగర్ కాలనీలో గల ఐసిడిఎస్ ప్రాజెక్టు మణుగూరు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీ టీచర్ల పోస్టుల కోసం ఆన్లైన్ చేసుకున్న దరఖాస్తులతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు కార్యాలయానికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఆన్లైన్ చేసినపుడు అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ సంతకాలు చేయించుకొని సంబంధిత కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.



ఈ నెల 27వ తేదీ సాయంత్రం వరకు సర్టిఫికెట్లు పరిశీ లన జరుగుతుందని, ఆ తర్వాత తీసుకువచ్చిన సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న చివరి తేదీ ఉన్నందున సకాలంలో సర్టిఫికెట్లు వేరిఫికేషన్ చేయించు కోవాలని ఆమె కోరారు. మండలం లోని అంగన్వాడీ టీచర్లు ఖాళీలు 24 ఉండగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు 751 వచ్చాయన్నారు. ఇప్పటివరకు 194 మంది అభ్యర్థులవి సర్టిఫికెట్లు పరిశీలించామని ఆమె వివరించారు.

## వర్షాలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం



అక్షర కలం : చిట్యాల

వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో గ్రామదేవత బొడ్రాయికి గ్రామస్తులు శుక్రవారం శ్రావణ పూజలు, జలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ కాటం వెంకటేశం బొడ్రాయికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు ఎండిపోకుండా ఉండాలని, గ్రామంలోని పాడిపంటలు సమృద్ధిగా వృద్ధి చెందాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామానికి ఎలాంటి అరిష్టాలు రాకుండా అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ?ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు కురు యాదయ్య, తెలుసూరి నరసింహ, సాగర్ల నాగరాజు, ఏర్పుల మల్లేశ్వరి వెంకన్న, జిల్లా ప్రశాంత్, మర్రి హరీష్ రెడ్డి, ఆనగంటి నరేష్, నీలకంఠం లింగస్వామి, ఏర్పుల నరసింహ, ఆవుల రాము, చేకూరి గణేష్, గంటల రవీందర్ రెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



అక్షరకలం వలిగొండ

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ఎం మండలం లో భువనగిరి ముద్దుబిడ్డ పార్లమెంట్ సభ్యులు యువ నాయకులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన పురస్కరించుకుని మండల కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది.తెలంగాణ ప్రాంత ప్రజల కోసం పార్లమెంట్లో కొట్లాడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాపతినిధులు సర్పంచులు అనుబంధ సంఘాల నాయకులు యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో 'జైల్ భరో'ను జయప్రదం చేద్దాం

-సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు




అక్షరకలం నల్గొండ

కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 2026 ఆగస్టు 10న నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కత్తుల లింగస్వామిల అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక సార్వభౌమత్వాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులు, రైతులు, ప్రజాతంత్రవాదులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. నయా ఉదారవాద సంస్కరణల్లో భాగంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, పని గంటలను 12 గంటలకు పెంచే విధానాలను స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. అలాగే విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారి ఐలయ్య ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు ఎండి సలీం, బండా శ్రీశైలం, వి.వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, మల్లేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం తెలుగు దినపత్రిక

## నేడు విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలి

ఆత్మకూరు (ఎం) అక్షర కలం



ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ నేడు జరిగే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. నీట్ పేపర్ లీకేజీ పైన ఢిల్లీలో జరుగుతున్న నిరసనలో భాగంగా ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటని పేపర్ లీకేజీ తో విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని గల మెత్తితే అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. రేపు జరిగే నిరసన బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఇట్టి బందులో ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి

## రామన్నపేట నూతన సీఐగా మోలుగురి రవి బాధ్యతల స్వీకరణ

అక్షర కలం : నకిరేకల్ నియోజకవర్గం



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పోలీస్ సర్కిల్ నూతన సర్కిల్ ఇన్సపెక్టర్ గా మోలుగురి రవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల డీటీసీ నుంచి బదిలీపై ఆయన రామన్నపేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల సహకారంతో ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సమాజానికి విఘాతం కలిగించే వారిపై మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ?కాగా ఇప్పటివరకు ఇక్కడ రామన్నపేట సీఐగా పనిచేసిన ఎన్. వెంకటేశ్వర్లు మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు.

## నేడు ఇందిరా పార్క్‌లో బీఆర్ఎస్వీ ఆందోళన

అక్షరకలం బిబినగర్



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద న్యాయం కోరుతూ నిరసన చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్వీ బీబీనగర్ మండల అధ్యక్షుడు పశ్చిమట్ల వంశీ గౌడ్ అన్నారు. విద్యార్థులపై జరిగిన చర్య అమానుషమని, కేంద్ర ప్రభుత్వ అణచివేత ధోరణికి నిరసనగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల పోరాటానికి సంఘీ భావంగా చేపట్టనున్న ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ బీబీనగర్ మండల అధ్యక్షుడు పశ్చిమట్ల వంశీ గౌడ్ పిలుపునిచ్చారు.

## గీత కార్మికులకు అండగా వనమహోత్సవం.....

-ఈత చెట్లను నాటిన ఎక్సైజ్ అధికారులు....

కొల్చారం, జూలై 23(అక్షర కలం):-



పర్యావరణాన్ని రక్షించడంతోపాటు గీత కార్మికులకు జీవనోపాధిని మెరుగుపరిచేదిశగా మెదక్ ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. గురువారం కొల్చారం మండల పరిధిలోని కొంగోడు గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గముతో పాటు మెదక్ ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై మాన్సింగ్ మాట్లాడుతూ ఈత చెట్లు గౌడ కార్మికుల కుటుంబాలకు జీవనోపాధి అని వీటి పెంపకం వల్ల పచ్చదనమే కాకుండా గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం చేకూర్తుందని వివరించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో తనవంతుగా ఒక్క మొక్క నాటి దానిని సంరక్షించితే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వామి వార్డు మెంబర్లు, గ్రామస్తులు మెదక్ ఎక్సైజ్ అధికారులు ఎస్సై మాన్సింగ్ తోపాటు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## రోడ్లను బాగు చేయండి లేదా ఇసుక లారీ లను నియంత్రించండి.

రావులపల్లి.రాంప్రసాద్, మానే.రామకృష్ణ,

అక్షర కలం / భద్రాచలం



భద్రాచలం నియోజకవర్గం లో రోడ్ల దుస్థితిదా రుణంగాఉంది. సామాన్యుడు రోడ్లువైపువెళ్లాలంటే భయపడు తున్నదుస్థి తిఉంది. నియోజకవ ర్గంమొత్తంఇసుకలారీ లవల్లరోడ్లుదా రుణంగాపెద్ద పెద్దగుంటలుప డిపాడైపోయినాయి.విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణికులు అత్యవసర సేవలకువెళ్లే ప్రజలుభయ భ్రాంతులకు గురవుతు న్నారు.ఈ రోడ్లమీద ప్రయాణంఅంటే నరకంలాఉందని ప్రయాణికులు చెబుతున్నారు.కానీ ఇలాంటి దారుణమైన పరిస్థితికి ఎమ్మెల్యేతెల్లం. వెంకట్రావు, బాధ్యతతీ సుకొనిరోడు బాగుచేయించాలి లేదాఇసు కలారీలనుని యంత్రించాలి లేదంటేబి.ఆర్. ఎస్.పార్టీఉద్యమ బాట పడుతుంది అని బిఆర్ఎస్ పార్టీ భద్రాచల నియోజకవం గ ఇంచార్జ్ రావులపల్లి.రాంప్రసాద్,మరియు మాజీ ఇంచార్జ్ మానే.రామకృష్ణ, హెచ్చరించారు.నా

## కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సిపి రష్మీ పెరుమాళ్, ఐపీఎస్

అక్షర కలం సిద్దిపేట జూలై 23:





సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ గురువారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆమె పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను, కేస్ డైరీలను సీపీ పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను ఆమె పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సీపీ మాట్లాడారు. వారి విధులు, పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు, సిబ్బందికి ఏవైనా వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ ఆదేశించారు.ఈ తనిఖీలో సిఐ రమేష్, పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారిపై కఠిన చర్యలు జిల్లా ఎస్పీ

గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి



జోగులాంబ గద్వాల్ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జూలై 1 నుంచి చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమం పురోగతిని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సమీక్షించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా నిర్వహించిన 12వ ఆపరేషన్ ముస్కాన్ కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక పోలీసు బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ బృందాలతో పాటు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖతదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గుర్తించిన బాలబాలికలను షెల్టర్ హోమ్‌లకు తరలిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని, 14 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిని కౌన్సెలింగ్‌కు పిలుస్తామని తెలిపారు. బాలల భవిష్యత్తు పరిరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్--12 లో 2026 జూలై 22 నాటికి జిల్లాలో పురోగతి: మొత్తం రక్షించిన చిన్నారులు -- 85 మంది (బాలురు 81, బాలికలు 4), రాష్ట్రానికి చెందిన పిల్లలు -- 67 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు -- 18 మంది, నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు -- 24. ఈ గణాంకాలు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతూ గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్, డీసీఆర్‌బీ సీఐ టాటా బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సహదేవుడు, డీడబ్ల్యూఓ శాఖ అధికారి సునంద, డీసీపీఓ శాఖ నుంచి నరసింహానాయుడు, ఆర్డీఓ కార్యాలయం నుంచి డి.టి. విమోచన, డీఈఓ కార్యాలయం నుంచి జీసీడీఓ కర్రెప్ప, డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జి. రాజు, డీఎల్‌ఓ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, చైల్డ్ హెల్ప్‌లైన్--1098 కోఆర్డినేటర్ శివలీల, ఆపరేషన్ ముస్కాన్ బృందం ఎస్సైలు ఆర్. శేఖర్, సురేష్, డీసీఆర్‌బీ ఎస్సై సుకూర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి ప్రభుత్వ ఆసుపత్రికి మౌలిక సదుపాయుల కొరకు 50 లక్షలు మంజూరు

-ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం.

-మరమ్మత్తుల పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్.

-జిల్లా జనరల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్.

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ డాక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఐసీయూ, ఇతర వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వారికి అందుతున్న వైద్య సేవలపై వాకబు చేశారు. గద్వాల ఆసుపత్రికి మంజూరైన వివిధ వైద్య, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించగా పొదలు పెరగడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగించని పాత మంచాలు, ఇతర వైద్య సామాగ్రిని ఎక్కడపడితే అక్కడ పడేయడం సరికాదని ఇలాంటి స్క్రాప్ ను వేలంపాట నిర్వహించి విక్రయించాలన్నారు. ఎగ్జామినేషన్ ట్రీట్మెంట్ విభాగంలో మానిటర్ యంత్రం పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రి కి అవసరమైన నిత్య అవసరాల పరికరాలు, మందులకు కావాల్సిన ప్రాతిప దానాలను అందజేస్తే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఆపరేషన్ థియేటర్లో చేయాల్సిన వివిధ పనులపై తగు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పలు మరమ్మత్తులు,విద్యుత్, ఇతర పనులకై రూ.50 లక్షల నిధులను కేటాయించినప్పటికీ సకాలంలో పనులు ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు.అవసరమైన విద్యుత్, రూఫ్ లైకేజీలు, కిటికులు తలుపులు, వెహికల్ పార్కింగ్ షెడ్ పనులును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పైన అంతస్తులో ఉన్న 50 మంచాల జనరల్ వార్డుకు వెళ్లేందుకు ఉన్న ర్యాంపుకు పైకప్పును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలనీ గుత్తేదారును ఆదేశించారు.రోగుల సహాయకులు వేచి ఉండేందుకు ఆసుపత్రి ఆవరణలో షెడ్ నిర్మాణం చేపట్టాలన్నారు. వివిధ పనులకై ఇదివరకు కేటాయించిన నిధులు సరిపోకుంటే అదనపు నిధులను మంజూరు చేస్తామని, ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా రోగులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకుల చాంబర్ లో కలెక్టర్ వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు, ఇతర సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. చాలా రోజులుగా విధులకు హాజరుకాని వైద్యులను సరెండర్ చేయాలన్నారు. ఏజెన్సీ ద్వారా అవుట్సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ, శానిటేషన్ కోసం పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారని, వారి సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మికి సూచించారు. నిబంధనల ప్రకారం అదనపు సిబ్బందిని నియమించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగుల సదరం శిబిరం నిర్వహణకు నూతనంగా నిర్మించిన భవనాన్ని, రేడియోలజీ, మైత్రి ట్రాన్స్ క్లినిక్, తదితర విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆసుపత్రి సమీపంలో నిరుపయోగంగా ఉన్న వివిధ వైద్య సిబ్బంది క్వార్టర్స్ ను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా వైద్యాధికారులు విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, వైద్యశాఖ ఏఈ రహీం, వైద్యాధికారులు, తదితరులున్నారు.

## విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఈనెల 25న కొత్తగూడెం విద్యానగర్ కు తరలి రావాలి

-ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :-



ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల స్కాలర్షిప్ పెండింగ్ సమస్యలపై ఈనెల 25న భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంలోని విద్యానగర్లో గల కమ్మవారి కళ్యాణ మండపంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం నిర్వహిస్తున్న ఫీజు రియంబర్స్మెంట్, పెండింగ్ స్కాలర్షిప్ సాధన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా బి ఆర్ఎస్ పార్టీ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షులు రేగా కాంతారావు పాల్గొననున్నారని ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని,ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే భానోత్ హరిప్రియ నాయక్ విజ్ఞప్తి చేశారు . విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియ అన్నారు. అనేక సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల కాక వేలాదిమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు సమిష్టి కార్యాచరణ అవసరమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి రాజకీయ పార్టీ, ప్రజా సంఘాలు,విద్యావేత్తలు బాధ్యతగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల సాధనలో బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఎస్ఐఆర్ లో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 23:

జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 90 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అనామోలీస్ ఎక్కువగా ఉన్నాయని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. నోటీసుల విషయంలో ఓటర్లు కంగారు పడవలసిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. డబుల్, డెత్, షిఫ్ట్ అయినవారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందని, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా బూత్ స్థాయి అధికారులకు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటలైజేషన్ పూర్తయిన



తర్వాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల 'యుడైస్' సవరణలు వేగవంతం చేయాలి

-రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి
-జీరో నమోదు పాఠశాలలు, ఎంఆర్సీ సిబ్బంది హాజరుపై విచారణ
-దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం

అక్షరకలం రంగారెడ్డి




రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల హాజరుపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భౌతిక నమోదు ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో తక్షణమే భౌతిక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల డేటాను సేకరించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భౌతిక డేటాకు యుడైస్ నమోదు సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించి, సవరించాలని ఆదేశించారు. కేజీబీవీ లలో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు.

**-జీరో నమోదు పాఠశాలలు -- ఉపాధ్యాయుల హాజరుపై విచారణ...**

మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి జీరో పాఠశాలలు గా మారడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ?అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నమోదులో ఎంఆర్సీ లలో పనిచేసే సీఆర్పీ ల హాజరు శాతం తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు.

**- దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్లు..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సివిల్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రతీ పాఠశాలలో స్వచ్ఛమైన, వినియోగంలో ఉన్న టాయిలెట్లు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలలో ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.

**-ప్రతి నెలా సమీక్షా సమావేశాలు...**

విద్యాశాఖలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి నెలా ఇటువంటి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. కావున ప్రతి మండల విద్యాధికారి తమ పరిధిలోని పూర్తి మరియు ఖచ్చితమైన సమాచారంతో (డేటాతో) తదుపరి సమావేశాలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి (DEO) వెంకటేశ్వర్లు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు, జిల్లాలోని అందరూ మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రోడ్లు, వసతుల కరువు కాలనీవాసుల ఆవేదన

మందమర్రి, జూలై 23 అక్షర కలం:

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు ఇచ్చి 20 నెలలు గడిచినా డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మాత్రం కనీస వసతులు, రోడ్లు కరువయ్యాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలంలో కాలనీలోని రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలిపారు. రోడ్లకు 20 నెలల క్రితమే రోడ్లు మంజూరు అయినట్లు మున్సిపాలిటీ అధికారులు, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పడమే తప్ప ఇంతవరకు పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. రోడ్లు మంజూరు అయ్యాయని చెబుతున్నా ఇప్పటివరకు పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. వర్షాలకు రోడ్లన్నీ బురద మయంగా మారాయని తెలిపారు. కాలనీలో వీధి దీపాలు సరిగా లేవని, ఉన్న వీధి దీపాలు సరిగా పనిచేయడం లేదన్నారు. దీంతో రాత్రుళ్లు చీకటిగా ఉండి దొంగల భయం, పాముల బెడద ఉందని భయాందోళనలు వ్యక్తం చేశారు. కాలనీలో గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి,





రోడ్డే కనిపించని పరిస్థితి నెలకొందని వాపోయారు. పారిశుద్ధ్య పనులు లేక దోమల బెడద అధికంగా ఉందన్నారు. పక్కనే ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి ఇక్కడి కంటే ఆలస్యంగా పట్టాలు ఇచ్చినా, అక్కడ సిసి రోడ్లు, సెంటర్ లైట్లు, వీధి దీపాలు, సిసి కెమెరాలు, బోర్ కు కరెంట్ మీటర్లు, బోర్ కరెంట్ బిల్లు అన్ని మున్సిపాలిటీ వారే వేశారన్నారు. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడ మాత్రం ఎందుకు ఇలా ఉందో అర్థం కావడం లేదని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీకి సంబంధించిన అధికార పార్టీ నాయకులు, మున్సిపాలిటీ అధికారులు 20 నెలలుగా కాలనీవాసులను మభ్యపెడుతున్నారే తప్ప ఏమీ చేయడం లేదని ఆరోపించారు. స్థానిక నాయకులు కాలనీ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లడం లేదనే అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

-మద్దతు తెలిపిన పిడిఎస్ఎఫ్

అక్షరకలం నల్లగొండ

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడి, లాఠీచార్జ్‌ను ఖండిస్తూ.. తెలంగాణ ఐక్య విద్యార్థి సంఘాలు నేడు (జూలై 24) పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిడిఎస్ఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ?నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ?నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని, ఎడీూూ బిల్లును వెంటనే రద్దు చేయాలి. విద్యారంగంలో కేంద్రీకరణ విధానాలను నిలిపివేయాలి. ?ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై పారదర్శక విచారణ జరిపి దోషులను శిక్షించాలని ?ఈ సందర్భంగా పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్గూరి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు స్వచ్ఛందంగా విద్యాసంస్థలను మూసివేసి బంద్‌కు సహకరించాలని కోరారు. విద్యార్థి లోకమంతా పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# సర్వైకల్ క్యాన్సర్'కు చెక్

- ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్
-14 ఏళ్ల బాలికలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్
-సురక్షితమైన టీకాతో పూర్తి రక్షణ అన్న జిల్లా వైద్యాధికారి డా. రాహుల్

అక్షరకలం నల్లగొండ



మహిళల ఆరోగ్యాన్ని పట్టిపీడిస్తున్న గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్‌ను ఆదిలోనే అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత హ్యూమన్ పాపిలోమా వైరస్ ( హెచ్ పి వి ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. రాహుల్ గురువారం ఒక ప్రకటన లో వ్యాక్సిన్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కౌమార దశలోని 14 సంవత్సరాల బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా పూర్తి స్థాయిలో రక్షణ కల్పించవచ్చని స్పష్టం చేశారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో సురక్షితమైనదని, ప్రభావవంతంగా పనిచేస్తూ దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని వైద్యాధికారులు వెల్లడించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ వ్యాక్సిన్ ధర రూ. 10,000 కు పైగా ఉండగా, ప్రభుత్వం దీన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తోంది. ? ముఖ్యంగా 8, 9, 10 తరగతులు చదువుతున్న 14 ఏళ్ల అర్హులైన బాలికలందరికీ ఈ వ్యాక్సిన్ అందించనున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి అర్హులైన ప్రతి బాలికకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలి. క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఎంహెచ్ఓ కోరారు.

# 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ.. భవిష్యత్ పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

-విజయవాడలో 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన సీఎం
-ఫ్యూచర్ పోలీసింగ్ సదస్సులో పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం
-ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పోలీస్ వ్యవస్థను ఆధునీకరించాలని సూచన
-పోలీసులకు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆదేశం
-రతన్ టాటా హబ్, విట్ యూనివర్సిటీతో పోలీసు శాఖ ఒప్పందాలుద



అక్షరకలం రంగారెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2001లోనే తాను ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అప్పటితో పోలిస్తే నేడు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరిగాయన్నారు. వీటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పోలీసు వ్యవస్థ పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కీలక బాధ్యతలు అప్పగించాలన్నారు. ఇందుకోసం సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ రేటు పెంపు వంటి అంశాల్లో ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బందికి డిజిటల్ లిటరసీ తప్పనిసరి అని, పోలీసు ఉన్నతాధికారులు కూడా నిపుణులతో సంప్రదింపులు జరుపుతూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. నేరం చేసిన వారికి వేగంగా శిక్షలు పడేలా దర్యాప్తు వ్యవస్థ పనిచేస్తేనే నేరస్థుల్లో భయం పుడుతుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన దర్యాప్తు కీలకమన్నారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ వెబ్‌సైట్, ధర్మ యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. రోడ్ సేఫ్టీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సహా 8 అంశాలపై ఏపీ పోలీసులు.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విట్ యూనివర్సిటీలతో ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఫోరెన్సిక్, డాగ్ స్క్వాడ్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, హోం సెక్రటరీ కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ అధికారులు, జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda-508 001 (Telangana) Printed at Pittale Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda 508 001. (Telangana) Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955